సరస్వతి (ఫైల్)

కృష్ణ (ఫైల్)

బైక్‌ను ఢీకొన్న లారీ

- తిరువూరులో తల్లీకొడుకు మృతి

ప్రజాశక్తి - తిరువూరు

బైక్‌ను లారీ ఢీకొనడంతో తల్లి కొడుకు మృతి చెందిన ఘటన ఎన్‌టిఆర్ జిల్లా తిరువూరు మండలంలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ముష్టికుంట్ల గ్రామానికి చెందిన అరిసేపల్లి సరస్వతి (70) తన కుమారుడు కృష్ణ (53)తో కలిసి బైక్‌పై ఆదివారం ఖమ్మం జిల్లా, అశ్వరావుపేట మండలంలోని తమ బంధువుల ఇంట్లో జరిగే ఫంక్షన్‌కి బయలుదేరారు. దమ్మపేట వద్ద అశ్వారావుపేట వెళ్లే జాతీయ రహదారిపై గాంధీనగర్ గ్రామం వద్ద బైక్‌ను ఎదురుగా వస్తున్న లారీ ఢీకొట్టింది. దీంతో తల్లీ కొడుకు అక్కడికక్కడే మృతి చెందారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాలను అశ్వారావుపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. సరస్వతికి భర్త, కుమార్తె ఉన్నారు. కృష్ణకు భార్య, ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు. తల్లీకొడుకుల మృతితో గ్రామంలో విషాదచాయలు అలుముకున్నాయి.

ఉక్కు కార్మికుల 'ఉపాధి రక్షణ యాత్ర'

- ఉక్కు కాంట్రాక్టు కార్మికులను తొలగించొద్దంటూ డిమాండ్
- కొత్త గాజువాక నుంచి కూర్మన్నపాలెం వరకూ పాదయాత్ర
- పోరాటాలతో ప్లాంట్‌ను కాపాడుకుంటాం : సిహెచ్.నర్సింగరావు

పాదయాత్ర నిర్వహిస్తున్న ఉక్కు కాంట్రాక్టు కార్మికులు, నాయకులు

ప్రజాశక్తి - గాజువాక (విశాఖపట్నం)

విశాఖ ఉక్కు కర్మాగారంలో కాంట్రాక్టు కార్మికులను తొలగించరాదని, తొలగించిన వారిని వెంటనే విధుల్లోకి తీసుకోవాలని, ఉక్కు నిర్వాసితులకు శాశ్వత ఉపాధి కల్పించాలని, స్టీల్‌ప్లాంట్ అమ్మకాన్ని ఆపాలని డిమాండ్ చేస్తూ విశాఖ ఉక్కు అఖిలపక్ష కాంట్రాక్టు కార్మిక సంఘాల ఆధ్వర్యాన ఆదివారం 'ఉపాధి రక్షణ యాత్ర' జరిగింది. విశాఖలోని కొత్త గాజువాక నుంచి కూర్మన్నపాలెం జంక్షన్ వరకు సాగిన ఈ పాదయాత్రలో కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ప్లాంట్‌పై కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తోన్న విధానాలను ఈ యాత్ర ద్వారా ప్రజలకు తెలియజేశారు. 50 సంవత్సరాల వయసులో ఉద్యోగాల నుంచి తొలగిస్తే ఎలా బతకగలమని, కనీసం వాచ్‌మ్యాన్ ఉద్యోగం కూడా రాదని పలువురు కాంట్రాక్టు కార్మికులు ఆవేదన వ్యక్తం చేశారు. పాదయాత్ర అనంతరం కూర్మన్నపాలెం కూడలిలోని ఉక్కు దీక్షా శిబిరం వద్ద సభ నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్.నర్సింగరావు మాట్లాడుతూ.. పోరాటాల ద్వారానే విశాఖ ఉక్కును కాపాడుకోగలమని తెలిపారు. బెదిరింపులకు కాంట్రాక్టు కార్మికులు తలొగ్గరన్నారు. తక్కువ జీతంతో ప్రాణాలను ఫణంగా పెట్టి వారు పనిచేస్తున్నారని తెలిపారు. ప్లాంట్‌ను ప్రయివేటుపరం చేసి రెండు లక్షల కోట్ల రూపాయల విలువగల ఆస్తులను కార్పొరేట్లకు కట్టబెట్టేందుకు కుట్ర జరుగుతోందన్నారు. ఐక్య పోరాటాలతో దాన్ని తిప్పికొడతామని స్పష్టం చేశారు. విశాఖ స్టీల్‌ప్లాంట్ బంగారు గని, బంగారు బాతు గుడ్డు వంటిదని, అందుకే దీనిపై కార్పొరేట్ల కన్ను పడిందని తెలిపారు. దీన్ని ప్రయివేటుపరం చేయడం ఎవరి తరమూ కాదన్నారు. ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా సాగుతున్న పోరాటం తప్పక విజయం సాధిస్తుందని తెలిపారు. సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కె.లోకనాథం మాట్లాడుతూ విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాటం చారిత్రాత్మకమైనదన్నారు. విశాఖ స్టీల్‌ప్లాంట్‌కు పూర్వ వైభవం తీసుకొస్తామని ఎన్నికలకు ముందు చెప్పి అధికారంలోకి వచ్చిన టిడిపి కూటమి ప్రభుత్వం తొమ్మిది నెలలు గడుస్తున్నా ఆ దిశగా కృషి చేయడంలేదని వివరించారు. కేంద్ర ప్రభుత్వంపై పోరాటం చేయాలని సిఎం చంద్రబాబును కోరారు. విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు అయోధ్యరామ్‌కు ప్లాంట్ యాజమాన్యం షోకాజ్ నోటీసు ఇవ్వడం దారుణమన్నారు. పోరాట కమిటీ నాయకుల జోలికొస్తే ఊరుకునేది లేదని హెచ్చరించారు. కాంట్రాక్టు కార్మికుల తొలగింపు దుర్మార్గమన్నారు. పార్టీ జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు మాట్లాడుతూ విశాఖ ఉక్కుకు ఇచ్చిన ప్యాకేజీ తాత్కాలిక ఉపశమనం మాత్రమేనన్నారు. విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ చైర్మన్లు డి.ఆదినారాయణ, ఎం రాజశేఖర్, కో-కన్వీనర్ జె.అయోధ్యరామ్ మాట్లాడుతూ ప్లాంట్ పరిరక్షణకు ఎంతటి త్యాగాలకైనా కార్మికవర్గం సిద్ధంగా ఉందన్నారు. కార్మికుల తొలగింపు చర్యలను విడనాడకుంటే పోరాటాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఉక్కు అఖిలపక్ష కాంట్రాక్టు కార్మిక సంఘాల నాయకులు నమ్మి రమణ, జి.శ్రీనివాస్ మాట్లాడుతూ.. కాంట్రాక్టు కార్మికులను తొలగించేందుకు ప్లాంట్ యాజమాన్యం ప్రణాళిక సిద్ధం చేసిందని తెలిపారు. మెడికల్ టెస్టుల పేరుతో కొంతమందిని ఇంటికి పంపేయడానికి కుట్రలు చేస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కెఎం.శ్రీనివాసరావు, ఆర్‌కెఎస్‌వి.కుమార్, స్టీల్‌ప్లాంట్ ఎంప్లాయీస్ యూనియన్ నాయకులు యు.రామస్వామి, వైటి.దాస్, ఉక్కు కాంట్రాక్టు కార్మిక సంఘాల నాయకులు ఎం రవి, వంశీ, గురునాథరావు, ఉమ్మిడి అప్పారావు, ఉరుకూటి అప్పారావు పాల్గొన్నారు. పాదయాత్రకు వైసిపి గాజువాక నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ తిప్పిల దేవన్‌రెడ్డి మద్దతు తెలిపారు.

సభలో మాట్లాడుతున్న మంత్రి కందుల దుర్గేష్

కథా రచనలలో చిన్నారుల ప్రతిభ అద్భుతం

- మంత్రి కందుల దుర్గేష్, ఎమ్మెల్సీ గోపి మూర్తి

ప్రజాశక్తి -రాజమహేంద్రవరం ప్రతినిధి

కథా రచనలలో చిన్నారుల ప్రతిభ అద్భుతమని, గోదావరి బాలల కథలు పుస్తకం వారిలోని సృజనాత్మకతకు దర్పణం పట్టిందని రాష్ట్ర పర్యాటక సాంస్కృతిక శాఖ, సినిమాటోగ్రఫీ మంత్రి కందుల దుర్గేష్ ప్రశంసించారు. గోదావరి బాలల కథల పుస్తకాన్ని ఆయన ఆవిష్కరించారు. గోదావరి బాలోత్సవం, బాలమందిరం సంయుక్త ఆధ్వరంలో తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరంలోని సంహిత కాలేజీలో ఆదివారం గోదావరి బాలల కథలు పుస్తక ఆవిష్కరణ సభ నిర్వహించారు. గోదావరి బాలోత్సవం అసోసియేట్ అధ్యక్షుడు విఎస్ఎస్ కృష్ణకుమార్ అధ్యక్షతన జరిగిన ఈ సభలో ముఖ్య అతిథులుగా మంత్రి దుర్గేష్ మాట్లాడారు. కవులు, కళాకారులకు రాజమహేంద్రవరం పుట్టినిల్లు అని, అటువంటి ఈ ప్రాంతంలో చిన్నారులలో సృజనాత్మకతను వెలికి తీసేందుకు రచనలను ప్రోత్సహించే దిశగా గోదావరి బాలోత్సవం, బాలమందిరం చేసిన ప్రయత్నం అభినందనీయమని అన్నారు. చిన్నారులు రాసిన కథలను కొన్నింటిని ప్రస్తావించారు. చిన్నారులు చదువులో, కళారంగాలలోనూ ప్రతిభ చూపాలన్నారు. ఇటువంటి ప్రయత్నానికి రాష్ట్ర ప్రభుత్వం నుంచి తమ సంపూర్ణ సహకారాలు అందిస్తామని తెలిపారు. ఉభయ గోదావరి టీచర్స్ ఎమ్మెల్సీ గోపిమూర్తి మాట్లాడుతూ చిన్నారులు పాఠాలను ఆట పాటలతో నేర్చుకోవటం ద్వారా మంచి ఫలితాలు వస్తాయన్నారు. సమాజ చైతన్యానికి దోహదపడతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో గోదావరి బాలోత్సవం ఆర్గనైజింగ్ కార్యదర్శి పి తులసి, అంగర గోపాలకృష్ణాచార్యులు, సత్యజ్యోతి, వి లీలావతి, అద్దేపల్లి ప్రభు, దాసరి సాయిబాబా, వినోద్, పట్నాయక్, అంజలి, లక్ష్మి పాల్గొన్నారు.

మండపేటలో రిలే దీక్షలు చేపట్టిన మహిళలు

మద్యం షాపు తొలగించాలని మహిళల దీక్ష

ప్రజాశక్తి - మండపేట (కోనసీమ జిల్లా)

నివాసాల మధ్య ఏర్పాటు చేస్తున్న మద్యం షాపునకు వ్యతిరేకంగా అంబేద్కర్ కోనసీమ జిల్లా మండపేటలో మహిళలు రిలే దీక్షలు చేపట్టారు. నిబంధనలకు విరుద్ధంగా సప్తగిరి థియేటర్ ఎదురుగా నూతనంగా మద్యం షాపును ఏర్పాటు చేయొద్దని శనివారం ఈ కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. తమ ఆడ బిడ్డలు ట్యూషన్‌లకు వెళ్లి రాత్రి 9 గంటల వరకు ఇంటికి వస్తూ ఉంటారని, ఈ ప్రాంతమంతా మందుబాబులతో నిండిపోతే తమ పిల్లల పరిస్థితి ఏమిటని ప్రశ్నించారు. తాము ఎంత ఆవేదన వ్యక్తం చేస్తున్నా నిర్వాహకులు దుర్మార్గంగా తమ ముందే నిర్మాణాలు కొనసాగిస్తున్నారని తెలిపారు. మద్యం షాపుల కారణంగా ఏ ఒక్క మహిళకూ ఇబ్బంది రాకుండా చూస్తానని మాట ఇచ్చిన డిప్యూటీ సిఎం పవన్ కల్యాణ్ తమకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. అధికారుల్లో స్పందన కనిపించకపోతే ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. దీక్షల్లో మండపేట ప్రాంత వాసులు రావూరి దుర్గాదేవి, పిల్లి నాగమణి, శీలం గనికమ్మ, కేతా దేవి, పిల్లి పద్మ, మురియడ్ బేగం, మామిడి లక్ష్మి, లంకపల్లి కుమారి, మద్దూరి దేవి, గుమ్ములూరు మహాలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

బెట్టింగ్ రాయుళ్ల కదలికలపై 'నిఘా'

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

ఐపిఎల్ క్రికెట్ సీజన్ నేపథ్యంలో బెట్టింగ్ నిర్వాహకులు, బుకీలు, పందెం రాయుళ్ల కదలికలపై ప్రత్యేకంగా నిఘా పెట్టామని డిజిపి హరీష్‌కుమార్ గుప్తా పేర్కొన్నారు. ఈ మేరకు ఆదివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. అమాయక ప్రజలను లక్ష్యంగా చేసుకుని క్రికెట్ బెట్టింగ్ ద్వారా ఎక్కువ డబ్బు సంపాదించవచ్చని వారిని ప్రలోభపెట్టేవారిని వదిలిపెట్టే ప్రసక్తే లేదని డిజిపి హెచ్చరించారు. అటువంటి వారిని చట్టం ముందు నిలబెట్టి కఠినంగా శిక్షిస్తామని ఆయన హెచ్చరించారు. అప్పులు చేసి బెట్టింగ్‌లు పెట్టి కుటుంబాలను ఛిన్నాభిన్నం చేసుకోవద్దని యువతను కోరారు. యువత బెట్టింగ్ రాయుళ్ల వలలో పడకుండా అప్రమత్తంగా వ్యవహరించాలన్నారు. క్రికెట్ బెట్టింగ్‌లకు పాల్పడినా, సహకరించినా కఠిన చర్యలు తప్పవని, ఈ తరహా చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడే వారిని వ్యవస్థీకృత నేరస్తులుగా పరిగణించి చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామన్నారు. బెట్టింగ్‌ల గురించి సమాచారం ఉంటే వెంటనే పోలీసులకు తెలపాలన్నారు. బెట్టింగ్ ముఠాల చేతిలో మోసపోయిన వాళ్లు ఫిర్యాదు చేస్తే నిందితులపై కేసు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.

హై కోర్టు ఆదేశాలను తక్షణమే అమలు : వ్యకాస డిమాండ్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

భూములు సేకరించిన ప్రాంతాల్లో సర్వం కోల్పోతున్న వ్యవసాయ కార్మికులకు పునరావాసం, పునర్నిర్మాణం చేపట్టాలని హై కోర్టు తీర్పును రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే అమలు చేయాలని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం డిమాండ్ చేసింది. 2016-17 మధ్య కాలం అప్పటి ప్రభుత్వం వివిధ ప్రాజెక్టుల పేరుతో సుమారు 5 లక్షల ఎకరాల భూములను సేకరించిందని సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి.వెంకటేశ్వర్లు ఆదివారం విడుదల చేసిన తెలిపారు. ఈ భూ యజమానులైన చిన్న, సన్న కారు రైతులతో పాటు సర్వం కోల్పోయిన వ్యవసాయ కార్మికులకు పునరావాసం, పునర్నిర్మాణం చేపట్టాలని 2016లో హై కోర్టును వ్యవసాయ కార్మిక సంఘం ఆశ్రయించిందన్నారు. 2017లో అందరికీ పునరావాసం, పునర్నిర్మాణం చేపట్టాలని తీర్పు చెప్పిందని పేర్కొన్నారు. గత వైసిపి ప్రభుత్వం, ప్రస్తుత కూటమి ప్రభుత్వాలు కోర్టు తీర్పును ఉల్లంఘించాయని తెలిపారు. అనకాపల్లి జిల్లా వంగలి గ్రామంలో పెట్రో కెమికల్ పేరుతో పేదల నుంచి భూములు ప్రభుత్వం లాక్కుందని, ఈ భూములు ప్రభుత్వానికి చెందిన అసైన్మెంట్ భూములని నష్టపరిహారం ఇవ్వకుండా ఉల్లంఘించిందన్నారు. దీనిపై వంగలి గ్రామ ప్రజలు తరుపున హై కోర్టును వ్యవసాయ కార్మిక సంఘం ఆశ్రయించిందని చెప్పారు. ఎట్టకేలకు వంగలి గ్రామంలో ఉన్న నిర్వాసితులతో పాటు రాష్ట్ర వ్యాప్తంగా భూములు కోల్పోయిన రైతులకు, భూములపై ఆధారపడి జీవిస్తున్న వ్యవసాయ కార్మికులకు, వృత్తిదారులకు పునరావాసం, పునర్నిర్మాణం కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వానిదేనని హై కోర్టు తీర్పు చెప్పిందని తెలిపారు. ఈ తీర్పును ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేయాలని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం డిమాండ్ చేసింది. పేదల కోసం సుదీర్ఘకాలం హై కోర్టులో వాదించిన విజయం చేకూర్చిన న్యాయవాదులు సిహచ్.రవికుమార్, కె.ఎస్.మూర్తి కృషిని ఈ సందర్భంగా కొనియాడారు.

విద్వేషాలను రెచ్చగొట్టేందుకు సర్వే!

ప్రజాశక్తి- గ్రేటర్ విశాఖ బ్యూరో

ఉత్తరాంధ్ర ప్రాంతంలో విశ్వ హిందూ పరిషత్ ఒక సర్వే చేపట్టింది. ప్రధానంగా క్రైస్తవ మైనారిటీలను లక్ష్యంగా చేసుకుని ఈ సర్వే జరుగుతోంది. ప్రజల సమస్యలను తెలుసుకోడానికో, వారి సామాజిక, ఆర్థిక, కుటుంబ పరిస్థితులను తెలుసుకోడానికో సర్వేలు చేయడం మామూలు. కానీ, చాలా అసాధారణమైన రీతిలో విహెచ్‌పి ఉత్తరాంధ్ర విభాగం ఒక సర్వేను చేపట్టింది. ఇది చాలా గోప్యంగా జరుగుతోంది. ఆ సర్వే పత్రం 'ప్రజాశక్తి'కి లభించింది. దానిని పరిశీలిస్తే ఈ సర్వే లక్ష్యం గ్రామాల వారీగా క్రైస్తవులు ఎందరు ఉన్నారో, ముఖ్యంగా దళితవాడల్లో క్రైస్తవులు ఎందరు ఉన్నారో గుర్తించడమేనని స్పష్టమవుతోంది. దానితోపాటు ఆ గ్రామంలో క్రైస్తవ వ్యతిరేకులు ఎవరెవరు ఉన్నారన్న వివరాలను కూడా ఆరా తీస్తున్నారు. విహెచ్‌పి గత చరిత్ర, అనుభవాలను దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం వెంటనే అప్రమత్తం కావాలని, ఇటువంటి సర్వేలను నిషేధించాలని, గ్రామాల్లో ప్రజల మధ్య ఉన్న సామరస్య వాతావరణాన్ని కాపాడాలని పలువురు ప్రజాస్వామ్యవాదులు విజ్ఞప్తి చేస్తున్నారు.


విశ్వ హిందూ పరిషత్-ఉత్తరాంధ్ర ధర్మప్రసార్-సర్వేక్షణ పత్రము

జిల్లా: ..... విభాగ్: ..... ప్రఖండ్: ..... గ్రామము: .....

ధర్మప్రసార్ ప్రముఖ్ పేరు: చరవాణి:

గ్రామములో ప్రత్యేక ప్రాంతము: హరిజనవాడ/అరుంధతీయవాడ/గిరిజనవాడ/ఇతర వాడలు/సాధారణ గ్రామము

1. మొత్తము గృహాలు(ఇండ్లు) : మొత్తము జనాభా
2. క్రైస్తవులుగా మారిన గృహాలు.....మొత్తము జనాభా.....ఎన్ని సంవత్సరాల నుండి మారివున్నారు ?
3. మొత్తము హిందూ దేవాలయాలు: ..... మొత్తము చర్చిలు.....
   మొత్తము మసీదులు.....
4. గ్రామంలో పాస్టర్ల సంఖ్య.....పాస్టర్లు గ్రామంలోనే నివాసమా,లేక బయట నుండి వస్తారా ?
   గ్రామంలోనే నివాసం :
   బయట నుండి :
5. గ్రామంలో క్రైస్తవానికి వ్యతిరేకులు ఉన్నారా? ఉంటే ముఖ్యమైనవారి 6మంది పేర్లు
   1.....2.....3.....
   4.....5.....6.....
6. గ్రామంలో తటస్థ క్రైస్తవ కుటుంబాల సంఖ్య: ..... (నామకే వాస్తవంగా ఉన్నవారు)
7. హిందువులుగా ఉన్నవారిలో మనకు ఉపయోగపడేవారు కనీసం 6 మంది పురుషులు, ఇద్దరు(2) మహిళలు, వారి పూర్తి పేర్లు
   1.....2.....3.....
   4.....5.....6.....
   7.....8.....
8. గ్రామపెద్ద/ప్రముఖ్/గ్రామంలో నాయకత్వం వహించేవారి పేరు, చరవాణి
   పేరు: చరవాణి:
9. గ్రామంలో అర్చక పురోహితుల పేర్లు:
10. హరిజన, గిరిజన పురోహితుల పేర్లు:
11. హిందూ ధర్మ ప్రచారంలో గ్రామంలో ఉన్న వివిధ ధార్మిక ఉపన్యాసకులు, భజన గురువులు, హరికథా వగైరా కళాకారుల పేర్లు:
   1. ఉపన్యాసకులు : 2. భజన గురువులు :
   3. కుల గురువులు : 4. కళాకారులు :
   5. సాదు పంతులు : 6. ఆశ్రమాలు :

సర్వేక్షణ పూర్తి చేసిన తేది గ్రామ ధర్మప్రసార్ ప్రముఖ్ సంతకము

చరవాణి :

సర్వే ఫారం

విద్యారంగ సమస్యలను వెంటనే పరిష్కరించాలి

సదస్సులో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ ఐ.వెంకటేశ్వరరావు

- యుటిఎఫ్ పోరుబాటలో రాష్ట్ర నేతలు, పిడిఎఫ్ ఎమ్మెల్సీలు

ప్రజాశక్తి-రాజమహేంద్రవరం ప్రతినిధి

విద్యారంగంలో నానాటికీ పేరుకుపోతున్న సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని పిడిఎఫ్ ఎమ్మెల్సీలు, యుటిఎఫ్ నేతలు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. యుటిఎఫ్ చేపట్టిన పోరుబాటలో భాగంగా తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరంలోని ఆనం కళా కేంద్రంలో ఆదివారం విద్యా సదస్సు నిర్వహించారు. యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎన్.అరుణకుమారి అధ్యక్షతన జరిగిన ఈ సదస్సులో ఎమ్మెల్సీ ఇళ్ల వెంకటేశ్వరరావు మాట్లాడుతూ.. పాలకులు ప్రభుత్వ విద్యా విధానానికి పెద్దపీట వేయాలన్నారు. పోరాటాల ద్వారా మాత్రమే ఉపాధ్యాయుల హక్కుల సాధన సాధ్యమని స్పష్టం చేశారు. ఉపాధ్యాయులు ఎప్పటికప్పుడు చైతన్యవంతులై కొత్త తరాలను తయారు చేయాలని కోరారు. ఎమ్మెల్సీ బొర్రా గోపిమూర్తి మాట్లాడుతూ.. జిఒ నెంబర్ 117 రద్దు, పాఠశాలల కుదింపు వంటి సమస్యలను ప్రభుత్వం పరిష్కరించకుంటే పోరాటాలు అనివార్యమని తెలిపారు. యుటిఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కెఎస్ఎస్.ప్రసాద్ మాట్లాడుతూ.. గత ప్రభుత్వం ఉద్యోగ ఉపాధ్యాయులకు రూ.20 వేల కోట్ల బకాయిలు పెట్టి వెళ్లిపోయిందన్నారు. టిడిపి కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 9 నెలలు కావస్తున్నా ఉద్యోగ, ఉపాధ్యాయుల బకాయిలపై సరైన శ్రద్ధ చూపడంలేదని తెలిపారు. దీంతో బకాయిలు రూ.30 వేల కోట్లకు పెరిగిపోయాయన్నారు. 29 శాతం ఐఆర్ ప్రకటించి, 12వ పిఆర్‌సి కమిటీ వేయాలని డిమాండ్ చేశారు. తమ సమస్యలు పరిష్కారమయ్యే వరకు పోరుబాట ఉద్యమాన్ని కొనసాగిస్తామని స్పష్టం చేశారు. యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు ఎన్ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఊరి బడిని బతికించుకోవటానికి ఉపాధ్యాయులంతా నడుం కట్టాలన్నారు. అందుకోసం పిల్లలు, తల్లిదండ్రులతో అవగాహన సదస్సులు నిర్వహించాలని కోరారు. ప్రభుత్వ విధానాలతో ప్రభుత్వ పాఠశాలలు ఉనికిని కోల్పోతున్నాయన్నారు. భవిష్యత్తులో మోడల్ పాఠశాలల పేరుతో గ్రామాల్లో చాలా పాఠశాలలను ఎత్తేయ్యాలనే యోచనతో ప్రభుత్వం ఉందని వివరించారు. తొలుత భగత్‌సింగ్, యుటిఎఫ్ ఉద్యమ నిర్మాతలు అప్పారి వెంకటస్వామి, ఎఇ సూర్యనారాయణ రాజు చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శులు ఎస్.జ్యోతిబసు, తోటకూర చక్రవర్తి, కె.శ్రీదేవి, తూర్పుగోదావరి, అంబేద్కర్ కోనసీమ, కాకినాడ, పశ్చిమ గోదావరి, అల్లూరి సీతారామరాజు జిల్లాల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పాల్గొన్నారు.

భోగాపురం ఎయిర్‌పోర్టుకు గ్రీన్‌ఫీల్డ్ రోడ్లు

ప్రజాశక్తి- గ్రేటర్ విశాఖ బ్యూరో

ఈ దారులన్నీ భోగాపురంలో జిఎంఆర్ నిర్మిస్తున్న 'గ్రీన్‌ఫీల్డ్' ఎయిర్‌పోర్టుకే అనేలా విశాఖ-విజయనగరం జిల్లాల్లో పలు రహదారుల పనులు జరగబోతున్నాయి. 2026 జూన్ నాటికి సిద్ధమవుతున్న భోగాపురం గ్రీన్ ఫీల్డ్ విమానాశ్రయానికి రాకపోకలకు ఇబ్బంది లేకుండా అత్యంత ప్రాధాన్యత కలిగిన చోట్ల 15 కొత్త రోడ్లకు విశాఖపట్నం మెట్రోపాలిటన్ రీజియన్ అభివృద్ధి సంస్థ (విఎంఆర్‌డిఎ) ప్రతిపాదనలను సిద్ధం చేసింది. విశాఖ నగరానికి 50 కిలోమీటర్ల దూరానగల కొత్త ఎయిర్ పోర్టుకు ఇప్పుడున్న పరిస్థితుల్లో ట్రాఫిక్ రీత్యా చాలా సమయం పడుతున్నందున ఫ్లై ఓవర్‌లు ఒకవైపు, వైజాగ్ నుంచి భోగాపురం వరకూ కోస్తా హైవే మరోవైపు, మెట్రో రైల్ ప్రాజెక్టు ఇంకోవైపు చేపట్టాలంటూ భీమిలి ఎమ్మెల్యే మాజీ మంత్రి గంటా శ్రీనివాసరావు రాష్ట్ర ప్రభుత్వంతో ఇటీవల చర్చలు జరిపారు. ఈ మేరకు ప్రభుత్వానికి ఇటీవల విఎంఆర్‌డిఎ అధికారులు 15 గ్రీన్ ఫీల్డ్ రోడ్ల డిపిఆర్‌ను పంపారు. గ్రీన్ ఫీల్డ్ రోడ్ల అనుసంధానంపై విఎంఆర్‌డిఎకు జివిఎంసి కూడా క్షేత్రస్థాయిలో సహకారాన్ని అందించనుంది. కొత్తగా ఏర్పాటు కాబోయే 15 గ్రీన్ ఫీల్డ్ రోడ్లకుగానూ రూ.390 కోట్లు ఖర్చవుతుందని విఎంఆర్‌డిఎ కమిషనర్ కెఎస్.విశ్వనాథన్ ఇప్పటికే స్పష్టం చేశారు. నూతనంగా నిర్మించబోయే రహదారులు భోగాపురం ఎయిర్ పోర్టుకు ప్రత్యామ్నాయ మార్గాలుగా ఉండనున్నాయి. నగరంలోని కీలక ప్రాంతాల మీదుగా ఈ రోడ్లు ఉంటాయని, వాహన రద్దీని తగ్గించేందుకు దోహదపడతాయని చెబుతున్నారు.

కనెక్టివిటీ విస్తరణ ఎలా?

విజయనగరం, భీమిలి సమీపంలోని చిప్పాడ, విశాఖపట్నం వద్ద గంభీరం, గండిగుండం, దొరతోట, మూలకుద్దు, జుత్తాడ, కొత్తవలస తదితర ప్రాంతాలన్నిటినీ కలిపి సుమారు 73 కిలోమీటర్ల మేర ప్రతిపాదనలు సిద్ధమయ్యాయి. 2026 జూన్ నాటికి భోగాపురం ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్టును సిద్ధం చేయాలన్న నిశ్చయంతో ప్రభుత్వం చకచకా పనులను చేపడుతున్న నేపథ్యంలో రోడ్ల విస్తరణ విశాఖ నగరం, తీర ప్రాంతం మీదుగా రెండువైపులా చేపట్టాలని విఎంఆర్‌డిఎ, జివిఎంసి అధికారులు తరచూ సమావేశాల్లో చెబుతున్నారు.

ఆధునీకరణ పనులు వేగవంతం చేయాలి

- శాప్ చైర్మన్ రవినాయుడు
- సమ్మర్ క్యాంపుల నిర్వహణకు ప్రత్యేక ఏర్పాట్లు

స్విమ్మింగ్‌పూల్ పనులను పరిశీలిస్తున్న శాప్ చైర్మన్ రవినాయుడు

ప్రజాశక్తి - ఎస్‌వియు క్యాంపస్ (తిరుపతి):

తిరుపతి నగరంలోని ఎస్‌వి ఆర్ట్స్ కళాశాల ప్రాంగణంలోని శ్రీశ్రీనివాస క్రీడా సముదాయంలో జరుగుతున్న ఆధునీకరణ పనులను వేగవంతం చేయాలని, డిఎస్‌ఎ అధికారులను, శాప్ ఇంజనీరింగ్ అధికారులను శాప్ చైర్మన్ అనిమిని రవినాయుడు ఆదేశించారు. నిర్దిష్ట సమయంలోపు పూర్తిచేసి క్రీడాకారులకు వినియోగంలోకి తీసుకురావాలని సూచించారు. శ్రీశ్రీనివాస స్పోర్ట్స్ కాంప్లెక్సులో జరుగుతున్న ఆధునీకరణ పనులను ఆదివారం ఆయన పరిశీలించారు. తొలుత శాప్ నిధులు రూ.24 లక్షలతో స్విమ్మింగ్ పూల్ వద్ద చేపడుతున్న పనులను పర్యవేక్షించారు. వేసవి సెలవుల దృష్ట్యా సమ్మర్ క్యాంపులు ప్రారంభించే నాటికి స్విమ్మింగ్ పూల్‌ను సిద్ధం చేయాలన్నారు. ఏప్రిల్ 10వ తేదీలోపు స్విమ్మింగ్‌పూల్‌ను ప్రారంభించి వాడుకలోకి తీసుకురావాలని ఆదేశించారు. స్మార్ట్ సిటీ నిధులతో క్రీడా సముదాయంలో చేపడుతున్న పనుల్లో భాగంగా నిలిచిపోయిన కొన్ని పనులను గుర్తించి ఆరా తీశారు. ఫ్లడ్ లైట్లు, సింథటిక్ ఫ్లోరింగ్, మూవ్‌బుల్ బాస్కెట్‌బాల్ పోల్స్ పనులను వేగవంతం చేయాలని, లేనిపక్షంలో శాప్ ఆధ్వర్యంలో చేపడుతున్న కాంట్రాక్టర్‌కు పనులను అప్పగించాలన్నారు. రైఫిల్ షూటింగ్ అభివృద్ధికి సంబంధించి ఎలాంటి సహకారం కావాలన్నా పిపిపి విధానం ద్వారా సమకూర్చేందుకు ఏర్పాట్లు చేస్తామని తెలిపారు. ఖేల్ రత్న అవార్డు గ్రహీత ధ్యాన్‌చంద్ విగ్రహం ఏర్పాటుకు చర్యలు చేపట్టాలన్నారు. మల్టీపర్పస్ హాలు నిర్మాణం పూర్తయినప్పటికీ ఎసిల ఏర్పాటు, లైటింగ్, పెయింటింగ్, తలుపులు, కిటికీల పనులు మిగిలున్నాయని, వాటిని కూడా వారంలోపే పూర్తిచేసి అప్పగిస్తామని కాంట్రాక్టర్ లోకేష్ వివరించారు. డిఎస్‌డిఒ సయ్యద్ సాహెబ్, ఎపిఇడబ్ల్యుఐడిసి ఎఇ రాఘవ, శాప్ ఎఇ మహేష్ తదితరులు పాల్గొన్నారు.

గృహం హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్
(గతంలో పూనావాలా హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్‌గా పేర్కొనబడింది)

నమోదిత కార్యా